# ప్రేమికులు

శ్రీసుభా



క్లబ్‌లో మూలగా కూర్చుని పేషెన్స్ ఆడుకుంటున్న మనిషిని చూపించి 'యెవరా కొత్తశాల్తీ' అని అడిగాడు గోవిందరావు .... మూడు రోజులుగా యిలా అడిగిన మిత్రమండలిలో ముఖ్యులందరికీ అతని గురించి నాకు తెల్సింది చెబుతూనే వచ్చాను. కొందరిని తీసుకువెళ్ళి పరిచయంకూడ చేశాను .... వారం నాడు సుబ్బారావు "యితను చక్రపాణి. నా ఎలిమెంటరీ స్కూల్ మిత్రుడు. యిప్పుడు ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నాడు. మనం మెచ్చుకునే చాలా సరదాల్ని మరింతగా ప్రేమించే మనిషి" అంటూ పరిచయం చేశాడు. అతనితో రమ్మీ ఆడాను. రాజకీయాలు మాట్లాడాను. సాహిత్యచర్చ చేశాను. అన్నిటిలోనూ ప్రవేశం వున్నట్లే మాటల కోసం తడుముకోకుండా నన్ను మూడొంతులు వొప్పిస్తూనే వచ్చాడు.

అలాంటి సుబ్బారావు స్నేహితుడు చక్రపాణి గురించి అతని కాలక్షేపం గురించీ మాకాలాన్ని వెచ్చిస్తూనే వచ్చాం.

"యింటికి వెళ్లరా? యెంతసేపీ

ఆటలు" అన్నాను గడియారం తొమ్మిదో సారి తుమ్మితే.

"ఆవిడ వస్తానంది" అన్నాడు. యెవరు అని నేనడగలేదు. ఆవిడంటే అతని భార్యట. పేరు శ్యామసుందరి. ప్రస్తుతం మద్రాసులో తల్లీ దండ్రీ దగ్గర వుంటోంది. కొంతకాలం– అంటే పిల్లలు పుట్టేవరకు యిద్దరూ వో ప్రవేట్ కంపెనీలోనే పనిచేశార్ట. యీవిడ మెటర్నిటీ లీవు తీసుకుని అది పూర్తి చేసుకుని వచ్చేసరికి – ఆఖాళీలో పని చేసే క్వాలిఫైడ్ క్యాండిడేట్‌ని కాదనలేక మేనేజర్ యీవిణ్ణి బ్రాంచి ఆఫీసుకు బదిలీ చేశాట్ట.

"భార్యా భర్తల్ని విడదియ్యటం పెద్ద నేరంగా పరిగణించనంత కాలం మన అడ్మినిస్ట్రేషన్ బాగు పడదండీ" అవును, ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్ళకి – పెళ్ళి అనంతరం ప్రేమతో దగ్గరకు వచ్చిన జనాభాకు – మనదేశ ఆర్థిక స్థితి అంతగా తోడ్పడదు. కన్న కలలు కలల్లోనే తప్ప వాస్తవంలో చేదు వాత పడుతూండడం, అన్నిటినీ ఛేధించుకుని పక్షిల్లా యెగిరి పోదామనుకుంటే కుటుంబమనే భవబంధాలు కాళ్ళకి వుచ్చులవడం.... ప్రయత్నం మీద తెగించినా – మానసిక సంక్షోభం, బంధువుల హిత బోధలు యెన్నో ఆటంకాలు. యీలోపునే ప్రేమ అనేక సంక్షోభాల పాలబడి నిరాశావాదాన్ని వరిస్తుంది. ఆఖరిగా పిల్లలు పుట్టి వాళ్ళ పెంపకం, చదువులు, వుపాధి, చాలీచాలని జీతాలు, తెగుళ్ళు అన్నిటినీ జీర్ణించుకోలేక ప్రేమికులమనే జ్ఞానపోయి స్నేహితులమనే జ్ఞాపకంలోకి జారి – తుదిగా గాలివాటుకు కల్సుకున్న బాటసారుల్ని చేస్తుంది భార్యాభర్తల్ని.

"ఇదే అమెరికాలో చూడండి – ప్రేమికుల్ని అరవైయేళ్ళ వయస్సులోనైనా చూడండి – వాళ్ళమనస్సుల్లో, నడతల్లో పాతికేళ్ళనాటి నవ్యత గోచరిస్తుంది ...." అతను అన్నాడు.

"అయితే మన దేశంలో సుఖపడుతున్న ప్రేమికులే లేరంటారా ?", ....

"వుంటే, వాళ్ళని రేర్ స్పెసిమన్స్‌లా కాపాడాలనే నా ఘోషంతా".

హాలంతా లవండర్ వాసన కమ్ముకుంది. గుమ్మంలోంచి లోపలికి వస్తూ మారుమూలబల్లదగ్గర మనిషినిచూసి కనుబొమ్మలెత్తి గుర్తించి కళ్ళతో పలకరించి. అందంగావున్న ముత్యాలపేటిక తెరిచినట్లున్న పలువరస విప్పి, మనసులో వుల్లాసాన్ని బహిర్గతం చేసే గుండెల్ని కప్పిన నీలంరంగు హేండ్‌లూమ్ చీర సరిచేసుకుంటూ. చిత్రకారులందరూ, విచిత్రాన్ని చూచినట్లు క్షణం కుంచెల్ని మరచి, అందానికి కొలమానాలు తీసుకోవాల్సిన శరీరపు వంపుతో నడిచివచ్చిన స్త్రీ, చక్రపాణి భార్య కాక మరెవరూ కారని అన్పించింది – నాకు.

"ఛలేవారే .... స్టేషనుకు రాకపోతే నేనేమవ్వాలి"

"నువ్వేరావాలి"....

"హుష్ అంటూ కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుంది. వింజామరలతో వీవెనలు వీచే చెలికత్తెలు – అలసటచేత నలిగిన కనురెప్పల మీద చందనం అద్దే చెలులు....నలిగిన చీరకుచ్చెళ్లు విశమర్చి

పరిలెఖ్ఖచూసేసఖులు .... వేసారిననడుము చుట్టూ వుంగరపువేలితో గిలిగింతలసవ్వడి చేసి నవ్వుల జల తరంగిణీలు విన్పించే టట్లు చెయ్యగలజాణకత్తెలు... వీళ్లందరూ కాలగర్భంలో కలిసిపోకపోతే— ఒక్కసారి పది శతాబ్దాల వెనక శ్యామసుందరి యెవరైె వుంటుందన్న వూహా కల్గింది.

" యీవిడే మా ఆవిడ "

నమస్కారమంది... పేరడిగింది... చక్రపాణి అంటున్నాడు. " యింత వరకూ సుబ్బారావు పత్తాలేడు. యీ క్లబ్ మెంబర్లు - ముఖ్యంగా యీ రమాపతి గారు లేక పోతే - మనం కల్సుకోలేక పోయేవాళ్లం తెలుసా"—

"సుబ్బారావు లేడా" అంది. యేకవచనం నన్ను భయపెట్టింది.

"వాడి పెళ్లాం పుంది. పెద్దపిల్ల తాతగారి దగ్గర, రెండో వాడు పి. యు. సి. మూడోవాడు థర్డ్‌ఫారం. ఆఖరి దానికి అక్షరాభ్యాసం."

"సుబ్బారావుగారూ నేనూ చిన్నప్పుడు కల్సి చదువుకున్నాం.

నేను చెప్పేదాన్ని చూడండి.... ఆయనే ఈయన. అప్పుడే ఆయనగారికి నలుగురు పిల్లలంటే - మనం కూడా పెద్దవాళ్ళమయినట్టే లెఖ్ఖ." లెదర్ బేగ్‌లో ఆల్బమ్ తెరిచి చిన్ననాటి విశేషాలు, ఆ విశేషాలకు కారకులయిన వ్యక్తుల్ని చూపిస్తోంది—మాకు.

సుబ్బారావు వూళ్లో వున్నట్టయితే వీళ్ళిద్దరి బాగోగులూ చూసుకునేవాడు. అంతవరకూ చక్రపాణి క్లబ్ లో నే రోజులు గడిపేస్తున్నాడు. ఇప్పుడు యిద్దర్నీ కలిసి క్లబ్‌లో వుండమనడం భావ్యంకాదనే ఉద్దేశ్యంతో—.

"చాలా టైమయింది. మా ఇంటికి వెడదాం లేవండి" అన్నాను.

"మీ ఇంటికా!" అన్నాడు చక్రపాణి.

"అవునండీ. మీరు మగ పురుగులు కాబట్టి యే అరుగుమీదైనా గడిపేస్తారు. ఆవిడకూడా వచ్చారు."

"చూశావా ....... నేను మూడు రోజులుగా యిక్కడవుండిపోతే ఆయనేంబాధపడలేదు. భార్యవంటూ నువ్వొచ్చినమూలంగా నాకూ విలువ పెరుగుతోందీవూళ్ళో"

ఆరాత్రి నిద్రమత్తులో శ్రీమతి వాళ్ళకు పెద్దగౌరవంచేయకపోయినా - హృదయం నుంచైనా కొద్దిగా చనువు యేర్పరుచుకుని - కాలక్షేపం యిస్తుందనుకున్నాను. నేనేదో కానిపనిచేసినట్టు కళ్ళతో బెదిరింపుగా చూడడం, మాటల్ని దిగమింగుకుని పొడిగా జవాబులివ్వడం నేను గమనిస్తూనేవున్నాను - హృదయంనుంచీ.

"నేనూ వంటచెయ్యగల్నండోయ్" అంటోంది శ్యామసుందరి.

"చాలా ఆర్టిస్టిక్‌గా వుంచారే యింటిని ..." నవ్వేసి అన్నాడుతిరిగి.. "మనిషి ప్రతిరూపాన్ని అతని పరిసరాల్ని బట్టి తెల్సుకోవచ్చునంటారు ..." భోజనాలు నలుగురూ కలిసేచేశాం. అప్పుడుకూడా సుగుణ అంతమాత్రంగానే మాట్లాడింది. శ్యామసుందరీ,చక్రపాణీ యేమన్నాఅనుకుంపోతారని మనసులో బాధపడుతూనే వున్నాను.

"ఏమండీ సుగుణగారూ .... యీ అప్పడాలూ, వడియాలూ, పనసపొట్టు

కూరా, మన పూర్వపు ట్రెడిషన్ యిన్నాళ్ళకి మీ యింటిలో చూస్తున్నాను"

ఎంతటి అభ్యుదయమైనా పురాతన సౌందర్యాన్ని మింగెయ్యకూడదు. అప్పుడే వర్తమానం అందంగా కన్పిస్తుంది. కొంతకాలానికి — మన అరిటాకుల్లో భోజనాలు, కార్తీక స్నానాల పేరిట తెల్లవారుఝామున వూరిచివర కాలవకు వెళ్ళడాలు, మడిబట్టలు, గేదె జున్ను, పెళ్ళికెదిగిన ఆడపిల్లల పంజాబ్ పట్టాల చప్పుళ్ళు, కర్రపెట్టెలో దాక్కున్న హార్మోని పెట్టెలు, వియ్యపురాళ్ళ బుగ్గపోట్లు, అప్పగింతలు, పల్లకీలో వూరేగింపులు, జులాయి గొట్టాలు, బురదరోడ్లు, నిద్రగన్నేరు చెట్టు చాటున దాక్కున్న మాలపడుచు, వుమ్మడి చెరువులో ఆడవాళ్ళ కబుర్లు, రాత్రిపూట వయసువాళ్ళ కబుర్లు, నల్లచేవ కర్ర పందిరి మంచాలు, వూదొత్తుల వెండి తాపడాలు, బంగారపు పువ్వులున్న పీటలు, యాభై యేళ్ళనాటి మన ఆంధ్రత్వం. తెరమరగయిపోతే...."

"మనుష్యుల ప్రవర్తనతో పాటే చరిత్ర కనుమరుగవుతుంది."

చాలా సేపు మాట్లాడుకుని నిద్ర కుపక్రమించాం. "వాళ్ళురావడం యిష్టం లేనట్టు యేమిటలా ముభావంగా వుంటావు" అన్నాను.

"అంటే యెగిరి గంతెయ్యమనా మీ వుద్దేశం." సుగుణ నిమ్మదిగా అంది తిరిగి.

"వాళ్ళిద్దరి గురించి మీకు కొత్తేమో గాని — నాకు చక్రపాణి గురించి కొంత తెలుసు. మాతోపాటు హైస్కూల్లో చదివేవాడు. పాడు అల్లరి చేశేవాడు. ఆడపిల్లల్ని నిలవ నిచ్చేవాడు కాదు."

"అదన్నమాట నీకోపం." నవ్వాను.

"కోపంకాదు అవన్నీ చెబితే మీరతన్ని అసహ్యించుకుంటారు. అతని మీద మీ మంచిఅభిప్రాయం నేనెందుకు పోగొట్టాలి.

"అందర్నీ యేమంటే నాకెందుకు. నిన్నేమనేవాడేమిటి" సుగుణ కసురుకుని అటువైపు మొహంపెట్టి పడుకుంది. చక్రపాణి యేవిధంగా ఆడపిల్లల్ని అల్లరి చేశేవాడో ఆ రోజుల్లో. ప్రేమలేఖలు రాసేవాడు కాదనుకుంటాను. దార్లు కాసి కూడా తిరిగే వాడూ కాదు. చక్రపాణి ప్రేమ విషయాల్లో కూడా వో ట్రెడిషన్ని ఫాలో అయ్యే వాడేమో!

నాకు నేను యిలా అని ఆలోచించలేకపోయాను. ప్రేమ అనేకవిధాల బహిర్గతం చేస్తారు. చెయ్యొచ్చు. నవ్వొచ్చింది. ఆవులింత వచ్చి చిటికలు వేసుకుంటున్నాను. అవతల వాకిట్లో వాళ్ళిద్దరి మాటలూ విన్పించాయి. నవ్వుకుంటున్నారు—స్వంత యింటిలోలా. వాళ్ళలో చాలామందిలో లేని స్వేచ్ఛ, నిర్భయత్వం వుంది. వెనక్కు చూస్తూ ముందుకు నడిచే వింతైన నైజంవుంది....

తెల్లవారిన తర్వాత నలుగురూ కలిసి కొండపల్లి వెళ్ళాలి. అది చక్రపాణి ప్లాను. సుగుణా, శ్యామసుందరీ తెల్లవారు ఝామునలేచి పులిహోరా పాయసం చేస్తారుట. నిద్ర తెచ్చుకుందుకు ప్రయత్నించాను.

* * *

వుదయం వాకిట్లో వెంకన్న మాటలు వినిపిస్తున్నాయి.

'అయ్యగారూ, దొరగారూ, అఫీసూ అంటున్నాడు. ఆఫీసు అంటుకు పోకుండానే వెంకన్నని కాపలా వుంచింది. వాడు వూరిమీద పడ్డాడంటే సగం కాలి పోయినట్లే లెఖ. నన్ను చూసివాడు కళ్ల నీళ్ల పర్యంతం పెట్టుకుని గబగబా చెప్పేశాడు. అయ్యగారనే ఆఫీసరుఫ్లడ్ డ్యూటీమీద విజయవాడ వెళ్లారుట గత సంవత్సరాల ఫ్లడ్ లెవెల్ వాటిలెఖలూ, అప్పుడు తీసుకున్న ప్రికాషన్స్, తత్ సంబంధమైన శాంక్షన్ ఫైల్, పూర్ ఫండ్‌కు ఐదువందలు డ్రాచేసి నన్ను తీసుకు రమ్మన్నారుట. ఆయన సంతకం చేసిన చెక్ నా కిచ్చాడు. వీధిలో జీప్ రెడీగావుంది. తప్పేటట్టులేక—

"మీరు తయారుకండి. మిమ్మల్ని కొండపల్లిలో డ్రాప్‌చేసి నేను విజయవాడ వెడతాను".

"అనుకోని అవాంతరం. పోనీ ప్రయాణం మానేద్దాం" చక్రపాణి అన్నాడు.

"నేను లేకపోతే సుగుణ మీ కంపెనీగా వుంటుంది. ప్లీజ్ ! నాకోసం సరదా వాయిదాపడం బాగోదు" అన్నాను.

సుగుణ అదోరకంగా చూసింది.

"మీరులేకపోతే ఆవిడకుకాలక్షేపం."

"నేను ఆయన్ని కొంగుకి ముడి వేసుకోలేదు". నవ్వేస్తూ అంది సుగుణ వుక్రోషంగా.

"అందుకు సంఘం అవకాశం ఇవ్వటం లేదు మీ ఆడవాళ్లకి. అది మా దురదృష్టం" చక్రపాణి [illegible] రణంగా అన్నాడు.

డ్యూటీమీదవెళ్లిన నేను రెండురోజుల తర్వాతగానీ యింటి రాలేక పోయాను. యింటికి వచ్చేసరికి వాకిట్లో సుగుణా, చక్రపాణీ కన్పించారు—రమ్మీ ఆడుకుంటున్నారు.

"పిక్నిక్ బాగాజరిగిందా ? అన్నట్టు శ్యామ సుందరి గారు కన్పించరేం ?".

"యేం చెప్ప మంటారు. కొండెక్కుతూంటే ఆవిడకు కళ్లు తిరగడం, ఆపైన వాంతులూ మొదలయ్యాయి. యెలాగో ఆ టిఫిన్లు మే యిద్దరం తిని—ఆవిణ్ణి అతి కష్టం మీద కొండదింపి—విజయవాడ తీసుకు వెళ్లి ఆస్పత్రిలో జేర్పించాం. రోజూ యీవిడా నేనూ వెళ్లి పలకరించి రావడం. ఆవిడ వాకటే పలవరింతలు, గుళ్లుట. కిరీటాలుట. అంతఃపురంలో ఆడవాళ్ల యేడ్పులు, మహమ్మదీయులు అత్యాచారాలు హిస్టరీ మెదడంతా వ్యాపించి—హిస్టీరియాలోకి దింపింది. కానీ సుగుణగారి సహాయం నే నే జన్మలో మర్చి పోలేను."

"నేనేం చేశానని నన్ను పొగుడుతారు? మీరూ లేకపోతే యీ యింటిలో బిక్కు—బిక్కు మంటూ నా ప్రాణాలు పోయేవి."

"కాఫీ ఫ్లాస్కులోవుంది తాగండి" అంటూ "చెప్పండి చక్రపాణిగారు ! ఆ ఫారిసీర్ గోదావరి దాటింతర్వాత" కాల్లేర్లో పడుంటాడనా లన్పించింది. మెదడంతా చిత్తు కాగితం చేసుకుని నేనొస్తే—మంచీచెడు లేకుండా....యీ ఆడవాళ్లంతాఇంతే! అతివృష్టి—అనావృష్టి.

"సుగుణా" కేకపెట్టాను.

"వస్తాను. ఆయనకు ఆ ఫీస రు పూనేడులా వుంది" సుగుణ మాటలు విన్పిస్తూనే వున్నాయి వాకిట్లోంచి.

భోజనంలోకి కాకరకాయకూర బెల్లం పెట్టి వండింది. కందిపొడెం, గోంగూర పచ్చడి, యేవీ నాకు సహించవు.

"ఈ చెత్తఅంతా ఎందుకొండినట్టు"

"మీరు రారనుకున్నాను. అవన్నీ చక్రపాణికి యిష్టంట."

"అతని యిష్టాలన్నీ బాగానే పసిగట్టావే?"

"చాల్లెండి. అతను వింటే బాధపడతాడు."

"మొగుడుగాడు యేమయినా నీకు చింతలేదన్నమాట."

నవ్వేస్తోంది... పమిటకొంగు నోట్లో పెట్టుకుని.. పక్క పాపిడి తీసుకుంది. యెప్పుడూపెట్టుకోన్ది ముక్కుపుడక... కాళ్లకి మువ్వల పాంజవులు... అచ్చు చక్రపాణి వూహా చిత్రంలా... అన్నం దిగలేదు...

నిమిషాలమీదలేచి ఆఫీసుకుబయలు దేరాను... ముంగిలా మూలబల్లమీద కూర్చుని చలంపుస్తకాలు చదువుకుంటున్నాడు చక్రపాణి

* * *

నేను పాతరాతియుగంనాటి మనిషిని కాను.. తిండిలేకపోతే మనుష్యుల్ని కాల్చుకుతినమనిచెప్పను... మనుష్యుల్లో వుండే సాధారణ లోటుపాట్లని క్షమించగల్ను.. కానీ, లేనిపోని తెగింపుతెచ్చుకుని కావాలనికాలుజారిపడే మనుష్యుల్ని నేను ప్రేమంచలేను.

ఆదరించి, ఆప్యాయంగా ప్రవర్తించిన మనుష్యులు వెన్నుపోటు పొడిస్తే – సతమత మవుతాను.. ప్రపంచగమనం మీద నమ్మకం పీగిపోతూంది.. వాకిట్లో బల్లకింద చక్రపాణి సుగుణ పేర వ్రాసిన వుత్తరం అనుకోకుండా నేను తెరచి చదివాను.. అది నాదనే వుద్దేశంతోనే విప్పాను. సాధారణంగా సుగుణ స్నేహితులు వ్రాసే వుత్తరాలు చూపించేది. అందులో సారాంశం మొత్తం వాకటే. వాళ్లిద్దరి యిన్నాళ్ళ వియోగం యీనాటికి యెలా పేరుకుని చిత్రహింస చేసి ది–కళ్ళకుందుకు కాలం కలిసిరాక గుండెల్లోదాచుకున్న కన్నీళ్లు–యేవిధంగా యింక ఆ చోటులో – అనురాగం జలించిందో – వ్రాశాడు.. చదవాలని పించలేదు. యెక్కడికయినా పోవాలని పించింది. వీధిలోంచి సుబ్బారావు వస్తున్నాడు.

"రమాపతి, నీతో అర్జంటుగా మాట్లాడాలి అలా వస్తావా" అన్నాడు వీధిగుమ్మంలోంచే. ఇద్దరం బయలుదేరాం.

"ఆ చక్రపాణిగాడు మీ యింట్లో వున్నాడు" చెప్పాను.

"అదీ, శ్యామసుందరి చూశావా .... మా ఆవిడతో నేను దాన్ని చిన్నప్పుడు ప్రేమించానని చెప్పిందిట. యెంత గుండెలుతీసిన బంటు కాకపోతే ఆల్బమ్ తెరిచి 'మీ ఆయనా నేనూ' అంటూ చూపించి నానా అల్లరీ చేస్తుంది....

"మీ ఆవిడ నమ్మిందా".

"నా మొహంలా వుంది. అద్దంలా యెదురుగుండా రుజువు కన్పిస్తూంటే.... అదొకటే గోల".

"అయినా శ్యామసుందరికి బుద్ధి వుండక్కర్లేదూ! వాళ్లు నన్ను ప్రేమించారు-వీళ్లు మోహించారంటూ ప్రచారం చేసుకుందుకు. ఇలాంటిదాన్ని ఆ చక్రపాణి యెలా భరిస్తున్నాడో?"

"మేం వొట్టి క్లాస్‌మేట్స్‌రా బాబూ., అదెందుకలా చెప్పిందో నా కర్థంకాదు. మా ఆవిణ్ణి నువ్వైనా నమ్మించు."


నాకంతా అగమ్యగోచరం అయ్యింది. యెక్కడినుంచో హఠాత్తుగా వూడి పడి రెండు కుటుంబాల్లో చిచ్చుబెట్టి వాళ్ళేం సాధించారు కనుక.... వళ్ళని నిందించి ప్రయోజనం? మన మనుష్యులు అంతే. ఇటు నమ్మిన సుగుణ తన కళ్ళల్లో నిప్పులు కుమ్మరించింది. అటు నిజం యేమయినా సుబ్బారావు కాపురం తెటికల పడుతోంది.

యింటికి వెళ్లాను. మడతమంచం మీద నిద్రపోతోంది సుగుణ. పక్కబల్ల మీద వెండిగ్లాసులో పాలు, ఆ పక్క స్టీల్ ప్లేటులో జంతికలు, దానికింద తెల్లని కాగితం అయిష్టంగానే తీశాను. సుగుణ చక్రపాణికి రాసుంటుందని పించింది

రఘుపతిగారూ—

ఆగండి వుత్తరం సాంతం చదివే వరకూ చింపడానికి ప్రయత్నిస్తే మీరే నష్టపోతారు.

సుగుణా నేనూ హైస్కూల్లో కలిసి చదువుకున్నాం. ఆ రోజుల్లో నేను ఆడపిల్లల్ని సరదాగా అల్లరిచేసేవాణ్ణి. అందుకేనేమో సుగుణ నన్ను మీ ఇంట్లో చూసి భయపడింది. కొండపల్లి వెళ్ళినప్పుడు ప్రేమా, వివాహాలు. నీతి



యిత్యాది విషయాలమీద వాదోపవాదాలు రేగాయి. ప్రేమించడానికీ, ఆరాధించడానికీ మనిషిలో ప్రత్యేకమైన భగవత్ ప్రసాదితమైన వరం వుండాలంటుంది సుగుణ - కాదు - పరిస్థితులూ, చుట్టూ మనుష్యులే మరో మనిషి బాగోగులకి కారకులవుతారంటాను .. నేను. నేనూ సుందరీ ప్రేమించుకొని పెళ్ళి చేసుకున్నాం. అందుకు చాలా అవస్థలు, చుట్టూతా మనుష్యులు పన్నిన వుచ్చులు దాటాం. మీ యిద్దరుకూడా ప్రేమించి, అందర్నీ కాదని రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నారట. యే పరిస్థితిలోనూ మీరు సుగుణ్ణి అనుమానించరుట. సరే అని కొద్దిగా చొరవతీసుకుని నా బలవంతం మీద యీ నాటకం ఆడ్డానికి వొప్పుకుంది. చిన్న గేమ్ ఆడాం. సుగుణ నాకు వుత్తరంలోలా ఆర్థిక సహాయం చెయ్యడం, మేం వెర్రెత్తిపోవడం అంతా వట్టిది. ఇవన్నీ మీరు నమ్మేసి భుజాలుతడుముకోకపోతేమీరు ఫక్తు ప్రేమికుల లెఖ్ఖలోకే వస్తారు. ప్రేమించిన మనిషిని, పెళ్లాడిన వాళ్ళని - మనం నూటికి నూరుపాళ్ళూ నమ్ముతున్నామా, లేక నమ్మినట్లు నటిస్తూనే బ్రతుకు వెళ్ళమారుస్తున్నామా ..ఇది మనదేశంలో చాలామంది హృదయాలు యిచ్చి పుచ్చుకున్న వాళ్లు వేసుకోవల్సిన ప్రశ్న. నేనూ, సుందరీ కూడా మా కుటుంబాల్లో చాలా మంది కుర్రకారుల్ని. వెన్నుతట్టి పరీక్షించి ప్రేమ పెళ్ళిళ్ళు చేశాం. రేపొద్దున్న వాళ్ల భవిష్యత్ లో సుఖ పడతారా లేదా అన్న ప్రశ్నకు జవాబు - ప్రేమికులైన మీ యీ అనుభవాన్నుంచి కొంత రాబట్టుకోవచ్చేమో. సుబ్బారావుగారి భార్య కూడా మా సుందరిని మరోవిధంగా అర్థంచేసుకుంది. నన్ను సుందరి లేవదీసుకుని వచ్చిందని ప్రచారం చేసిందిట. నిజంగా సుందరిలో ఆ శక్తి వుంటే అది యెప్పటికీ అలాగే వుండాలని కోరుకుంటున్నాను. కానీ ఆవిడ సుందరి దగ్గర ఆల్బమ్‌లో భర్తగారి ఫొటోచూసి వొకే నరకయాతన పడ్డారుట. వాళ్ళు వయసులో ప్రేమించుకుని దగ్గరయిన వాళ్ళనని విన్నాను. ఇంకా ఆవిడ భర్తని అనుమానిస్తోందంటే మాకు నవ్వొస్తోంది. ప్రేమకు పర్యవసానం అగ్నిపరీక్ష కాకూడదు. నిజమైన అనురాగానికి అవాంతరా లేమిటిట ?

రేపు మీలాగే సుబ్బారావు గారొచ్చి జరిగిన పొరపాటు విప్పిచెబుతారు. ఆ ఆల్బమ్ రహస్యం విప్పుతారు. రెండు రోజులు మీకూ, నాలుగ్రోజులు సుబ్బారావుగారికీ గెస్ట్సగా వుండి మేం అల్లరి చేశాం - మిమ్మల్ని.

"మనలో కుర్రతనం పోలేదేమో" అంటూవుంటుంది సుందరి. "కాదు. మనెవ్వరిలోనూ నిండుతనం చావకూడదంటాను" నేను.

నేను సుగుణని లేపి, చెవులుమెలేసి, ఆ పైన యిద్దరం కలిసి ఆనందంగా కేకలువేసి, గడ్డివాముమీద చందమామని నిద్రలేపి, ఆ రాత్రిని పగలుచేస్తే - యెవరూ ఆశ్చర్యపోరు. పైగా సహజం అనుకుంటారేమో కూడా ....

* * *